బద్దిపోచమ్మకు బోనం మొక్కు

వేములవాడ: రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. నెత్తిన బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం బోనం, కల్లుసాక, ఒడి బియ్యం సమర్పించుకున్నారు.


బద్దిపోచమ్మ ఆలయం ముందు భక్తులు


నెత్తిన బోనాలతో ఆలయంలో భక్తులు

న్యూస్‌రీల్

విద్య జీవితాన్ని మారుస్తుంది



ఇల్లంతకుంట(మానకొండూర్): విద్య జీవితాన్ని మారుస్తుందని, వనరులను పూర్తిస్థాయిలో వినియోగించుకుని విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని ఇంటర్మీడియెట్ విద్యామండలి ప్రత్యేకాధికారి రమణారావు పేర్కొన్నారు. ఇల్లంతకుంటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సూచించారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ దేవరాజం ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి రజిత సూచించారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఆరోగ్యకేంద్రంలోని రికార్డులు పరిశీలించారు. జిల్లా వైద్యాధికారి రజిత మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై వందశాతం లక్ష్యాలు సాధించాలన్నారు. గ్రామాల్లో వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మండల వైద్యాధికారి సారియా అంజుమ్ పాల్గొన్నారు.

మండల పరిషత్‌లో ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్



తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండల ప్రజాపరిషత్‌లో ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ ప్రారంభమైంది. తంగళ్లపల్లి మండల పరిషత్‌లోని ఉద్యోగులు మంగళవారం ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ ద్వారా అటెండెన్స్ వేశారు. ఎంపీడీవో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్‌ను అమలు చేస్తున్నట్లు తెలిపారు.

దివ్యాంగులపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలి

- భవిత సెంటర్ నిర్వాహకురాలు జయలక్ష్మి



వేములవాడరూరల్: దివ్యాగులపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలని భవిత సెంటర్ నిర్వాహకురాలు కత్తి జయలక్ష్మి సూచించారు. వేములవాడ మండల పరిషత్‌లోని భవిత సెంటర్‌లో మంగళవారం దివ్యాంగుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. జయలక్ష్మి మాట్లాడుతూ భవిత సెంటర్‌లో పిల్లలకు ప్రత్యేకంగా అవగాహన, శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు కూడా ప్రత్యేక దృష్టి పెడితే వారికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అంగవైకల్యం ఉన్న పలువురికి భవిత సెంటర్‌లో ఫిజియోథెరపీ చేయిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ మయూరి, గర్ల్స్ హైస్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం బన్నాజీ తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ టీచర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

సిరిసిల్లటౌన్: జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఆంగ్ల మాధ్యమ అతిథి ఉపాధ్యాయులు, అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌సీవో అంజలి తెలిపారు. ఈనెల 11న ఇంటర్వ్యూ, డెమో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జేఎల్ జువాలజి(మహిళ), జేఎల్ కెమిస్ట్రీ(మహిళ), జేఎల్ ఇంగ్లిష్(జనరల్), పీజీటీ మ్యాథ్స్(జనరల్ మహిళ), పీజీటీ ఫిజికల్ సైన్స్(జనరల్, మహిళ), పీజీటీ ఇంగ్లిష్(మహిళ), టీజీటీ ఇంగ్లిష్(జనరల్) సబ్జెక్టుల్లో బోధించేందుకు దరఖాస్తులు కోరుతున్నామన్నారు. బీఎడ్, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈనెల 11న కరీంనగర్ జిల్లాలోని తిమ్మాపూర్ మండలం ఎల్‌ఎండీ కాలనీలోని పాత రిజిస్ట్రేషన్ ఆఫీస్ వెనకాల మహాత్మా జ్యోతిబాపూలే బాలికల పాఠశాలలో ఉదయం 10గంటలకు ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.


ముక్కు మూసుకొని పాఠాలు వింటున్న గీతానగర్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు


పాఠశాల గోడ పక్కనే పడేసిన కుళ్లిన కూరగాయలు


పాఠశాల సమీపంలో మూత్ర విసర్జన ఆనవాళ్లు

ఇలాగైతే పాఠాలు వినేదెలా?

సిరిసిల్లలోని గీతానగర్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సాఫీగా పాఠాలు వినలేకపోతున్నారు. పక్కనే ఉన్న రైతుబజార్‌లో కుళ్లిన కూరగాయలను స్కూల్ ప్రహరీని ఆనుకుని పడేస్తుండడంతో ఆ దుర్వాసన స్కూల్‌లోకి వ్యాపిస్తోంది. ఫలితంగా ఆ వాసనకు విద్యార్థులు సరిగా పాఠాలు వినడం లేదు. అంతేకాకుండా తెల్లవారుజామున రైతుబజార్‌కు వచ్చే వ్యాపారులు, రైతులు మూత్ర విసర్జన కూడా స్కూల్ గోడను ఆనుకుని కానిచ్చేస్తుండడంతో మరింత దుర్వాసన వస్తోంది. మున్సిపల్ అధికారులు స్పందించి ఈ దుర్వాసనను దూరం చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్న సిరిసిల్ల

వామ్మో.. వానరదండు

- వణుకుతున్న సిరిసిల్ల ప్రజలు
- ఇళ్లలోకి చొరబడి.. దాడి చేస్తున్న కోతులు
- భయాందోళనలో జిల్లా ప్రజలు
- అధికారులు పట్టించుకోవాలని విన్నపం


శివనగర్‌లో ఇంటి చుట్టూ తిరుగుతున్న కోతులు


ఇంటి గోడపై సేద తీరుతున్న కోతులు

సిరిసిల్లఅర్బన్: కండ్లుమూసి.. తెరిచేలోపే ఇళ్లలోకి ప్రవేశించి.. దొరికిన వస్తువును ఎత్తుకెళ్తున్నాయి. తరుముదామని ప్రయత్నిస్తే తిరిగి దాడి చేస్తున్నాయి. ఇలా కోతుల దాడులో జిల్లాలో పదుల సంఖ్యలో గాయపడ్డారు. పల్లె..పట్నం తేడా లేకుండా కోతుల భయాందోళన వీడడం లేదు. కోతులను ఊళ్ల నుంచి తరిమికొడుదామని గత ప్రభుత్వం చేపట్టిన మంకీ ఫుడ్ కోర్టులు జిల్లాలో మొక్కలు లేకుండా మారిపోయాయి. దీంతో కోతులు ఊళ్ల నుంచి వెళ్లిపోవడం కాదు కదా.. వాటి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుంది. జిల్లాలో కోతుల మంద దాడులపై ప్రత్యేక కథనం.

దాడులు.. గాయాలు

- సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని శివనగర్, గణేశ్‌నగర్, బీవైనగర్, పద్మనగర్ ప్రాంతాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉంది. ఆయా ప్రాంతాల్లో పలువురిపై దాడి చేశాయి.
- ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో ఓ వృద్ధురాలిపై దాడి చేయగా తీవ్రంగా గాయపడింది. మరో సంఘటనలో కోతులు వెంబడించడంతో ఓ వృద్ధురాలు పరుగెత్తగా ప్రమాదవశాత్తు చేదబావిలో పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కాపాడారు.
- ముస్తాబాద్ మండలంలోనూ కోతుల మంద దాడి చేయడంతో ఓ వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది.

వానర విధ్వంసం

గుంపులుగా వస్తున్న కోతులు పెంకుటిండ్లు కనిపిస్తే చాలు పెంకులు తీసి కింద పడేస్తున్నాయి. ఒకప్పుడు ఏళ్లకేళ్లు మన్నిక వచ్చే పెంకుటిండ్లు నేడు రెండు, మూడేళ్లలోనే ఉరుస్తున్నాయి. పెంకులు పగిలిపోతున్నాయి. అంతేకాకుండా ఇండ్లలోకి చొరబడి తినుబండారాలను ఎత్తుకెళ్తున్నాయి. కోతుల నుంచి తమను తాము కాపాడుకునేందుకు చాలా కుటుంబాలు ప్రధాన ద్వారాలు ఎప్పుడూ మూసివేసి ఉంచుతున్నాయి. మరికొందరేమో జాలీలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇది అదనపు ఖర్చు అయినా కోతుల బెడద నుంచి రక్షణకు తప్పనిసరిగా పెట్టుకుంటున్నారు.

కొన్ని గ్రామాల్లో స్వచ్ఛందంగా

ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్, రాచర్ల గొల్లపల్లిల్లో పలువురు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఒక్కో కోతికి రూ.500 చొప్పున చెల్లించి పట్టించారు. దీని ద్వారా ఆయా గ్రామాల్లో ఏడాది, రెండేళ్లపాటు కోతుల బెడద లేకుండా పోయింది. ఇలాంటి చర్యలు మిగతా గ్రామాల్లోనూ తీసుకుంటే కోతుల నుంచి కొంత మేరకు రక్షణ కల్పించుకున్న వారవుతారు. కోతుల బెడదపై అటవీశాఖ అధికారికి ఫోన్ చేయగా స్పందించలేదు.

ఇంట్లోకి చొరబడుతున్నాయి



మా పద్మనగర్‌లో కోతుల బెడద ఎక్కువగా ఉంది. ఉదయాన్నే ఇండ్లపైకి చేరుకుంటున్నాయి. డోరు తీసి ఉంటే చాలు ఇంట్లోకి చొరబడి ఏది కనిపిస్తే దాన్ని ఎత్తుకెళ్తున్నాయి. నిత్యావసర సరుకులు దక్కడం లేదు. వాటిని బెదిరిస్తే మీదికొస్తున్నాయి. కోతుల బెడద లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బంక శంకర్, పద్మనగర్, సిరిసిల్ల

భయపడుతున్నాం



ఆడవుల నుంచి కోతులు పట్టణాలు, పల్లెల్లోకి వస్తున్నాయి. ఇంటి ముందు పండ్ల చెట్లు ఉంటే చాలు గంటల తరబడి వాటిపైనే ఉంటున్నాయి. కోతులతో అందరం భయపడుతున్నాం. ఎండాకాలంలో మాత్రమే వచ్చే కోతులు ఇప్పుడు అన్ని కాలాల్లో కనిపిస్తున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ప్రశాంత్, అభికానగర్, సిరిసిల్ల

ఆలయ అభివృద్ధి పనులు మొదలుపెట్టాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ


ఆలయ పరిసరాలు పరిశీలిస్తున్న కలెక్టర్

వేములవాడఅర్బన్: అంజన్న ఆలయంలో అభివృద్ధి పనులు మొదలుపెట్టాలని అధికారులను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ ఆదేశించారు. వేములవాడ మండలం అగ్రహారంలోని హనుమాన్ ఆలయం వద్ద రూ.31లక్షలతో ఆర్చి, ప్రాకారం, కమాన్ నిర్మాణానికి ఇటీవల శంకుస్థాపన చేశారు. కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఆలయ ఈవో శ్రీనివాస్‌కు, అధికారులకు పలు సూచనలు చేశారు. సిరిసిల్ల–కరీంనగర్ ప్రధాన రహదారి మధ్య నుంచి 50 ఫీట్ల దూరం నుంచి ఆర్చి, ప్రాకారం సాలహారంతో కలిసి కమాన్ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. టెండర్ ప్రక్రియ ఇటీవల పూర్తయిందని వెల్లడించారు.

ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు

కోనరావుపేట(వేములవాడ): ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ హెచ్చరించారు. కోనరావుపేటలోని గ్రోమోర్ ఎరువుల దుకాణం, గౌరీశంకర్ ఫర్టిలైజర్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాములలో మంగళవారం తనిఖీ చేశారు. రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువులు అందుబాటులో ఉండాలని సూచించారు. యూరియాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్ల గురించి వివరించాలని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం తదితరులు పాల్గొన్నారు.

స్వశక్తి మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఎరువులు, ఫర్టిలైజర్ దుకాణాలు ఏర్పాటు చేసుకున్న మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ ఆకాంక్షించారు. ఇందిరా మహిళాశక్తి కింద మర్తనపేటలో విశ్వదర్శనీ గ్రామ సమైక్య ఏర్పాటు చేసిన ఎరువులు, విత్తనాల దుకాణాన్ని ప్రారంభించారు. అనంతరం కొలనూర్‌లో కలకుంట రమణ నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటిని పరిశీలించారు. త్వరగా పూర్తి చేసుకుంటుండడంపై అభినందించారు. బేస్‌మెంట్, రూఫ్‌లెవల్ కింద ఇప్పటికే రూ.2లక్షలు జమయ్యాయని, ఆర్‌సీ లెవల్ పూర్తయినందున చివరి బిల్లు అందించేందుకు చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. తన భర్తకు కంటి సమస్య ఉందని, ఆదుకోవాలని రమణ కోరగా సిరిసిల్లలోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో వైద్యం చేయించాలని అధికారులకు సూచించారు. డీఆర్డీవో శేషాద్రి, జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ఏఎంసీ వైస్ చైర్మన్ తాళ్లపెల్లి ప్రభాకర్, మాజీ సర్పంచ్ వెన్నమనేని వంశీకృష్ణారావు పాల్గొన్నారు.

11 నుంచి నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం

సిరిసిల్లకల్చరల్: జిల్లాలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. 19 ఏళ్లలోపు పిల్లలతోపాటు వివిధ విద్యాలయాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఈనెల 11న ఆల్బెండజోల్ మాత్రలు అందజేయాలని సూచించారు. ఈనెల 18న ముగింపు రోజున ఇంటింటికి వెళ్లి మాత్రలు అందజేయాలన్నారు. డీఎంహెచ్‌వో రజిత, వేములవాడ ఏరియా ఆస్పత్రి పర్యవేక్షకుడు డాక్టర్ పెంచలయ్య, విద్యాధికారి వినోద్‌కుమార్, సంక్షేమాధికారి లక్ష్మీరాజం, డీపీఆర్వో శ్రీధర్, డీపీవో షరీఫొద్దీన్ పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చివేత

సాక్షి ఎఫెక్ట్


గుంతలు పూడ్చిన రహీంఖాన్‌పేట, వెల్జిపురం రోడ్డు

ఇల్లంతకుంట(మానకొండూర్): 'సారూ.. ఈ రోడ్డు బాగు చేయండి' శీర్షిక సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్థానిక నాయకులు స్పందించారు. గతనెల 26న రహీంఖాన్‌పేట మోడల్‌స్కూల్ ఆన్‌లైన్ తరగతుల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ స్కూల్‌కు వచ్చారు. రహీంఖాన్‌పేట నుంచి వెల్జిపురం వరకు గల 4 కిలోమీటర్ల రోడ్డు భారీ గుంతలు పడింది. దీనిపై సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో ఇరు గ్రామాలకు చెందిన నాయకులు రోడ్డుపై మొరం పోసి గుంతలు పూడ్చివేశారు.

ఎస్టీడీ బూత్‌బాయ్ ప్రస్థానం ఆదర్శం

- 'ఎల్లలు దాటిన పోతుగల్ స్వీట్లు'పై కేటీఆర్ ఎక్స్‌లో పోస్టు



ఎక్స్‌లో కేటీఆర్ చేసిన పోస్టు

ముస్తాబాద్(సిరిసిల్ల): సాధించాలనే పట్టుదల.. చేసే పనిపై ప్రేమ ఉంటే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చని ఎస్టీడీ బూత్ బాయ్ నుంచి పలు రెస్టారెంట్లకు యజమాని అయిన బాలకృష్ణ ప్రస్థానం ఎందరికో ఆదర్శనీయమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.తారక రామారావు 'ఎక్స్'లో మంగళవారం పోస్టు చేశారు. 'సాక్షి'లో 'ఎల్లలు దాటిన పోతుగల్ స్వీట్లు' శీర్షికన ప్రచురితమైన కథనానికి కేటీఆర్ స్పందించారు. స్వీటెస్టు న్యూస్ ఈరోజు ఉదయమే చూశానని, ఆ కథనం చదవుతుంటే బాలకృష్ణ సాధించిన విజయంపై గర్వంగా అనిపించిందని పేర్కొన్నారు. ఎస్టీడీలో బూత్‌బాయ్‌గా పనిచేసి పోతుగల్.. సిరిసిల్ల నుంచి దుబాయ్ వరకు ఎదిగి ఎన్నో రెస్టారెంట్లు స్థాపించి 600 మందికి ఉపాధి కల్పిస్తున్న పోతుగల్ బిడ్డ బాలకృష్ణ సక్సెస్ స్టోరీ అద్భుతమని కొనియాడారు. నిజాయితీతో చేసే ఏ పనైన విజయం వైపు తీసుకెళ్తుందన్నారు. బాలకష్ణ కథనం యువతకు స్ఫూర్తిదాయకమన్నారు.

8న పాలిటెక్నిక్‌లో స్పాట్ ప్రవేశాలు

సిరిసిల్లకల్చరల్: అగ్రహారంలోని శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో తుది విడత కౌన్సెలింగ్ తర్వాత మిగిలిన సీట్ల భర్తీకి నెల 8న స్పాట్ అడ్మిషన్ కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రభాకరాచారి ప్రకటనలో తెలిపారు. సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ ఇంజినీరింగ్‌తోపాటు టెక్స్‌టైల్ టెక్నాలజీ కోర్సుల్లో సీట్ల భర్తీకి పాలీసెట్‌లో అర్హత పొందిన వారు, పదో తరగతి ఉత్తీర్ణులు ఈనెల 7న దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ ప్రతులతో ఈనెల 8న ఉదయం 10.30 గంటలకు కళాశాలలో హాజరుకావాలని సూచించారు.

ప్రభుత్వ వైద్యులుగా అన్నదమ్ములు



సిరిసిల్లటౌన్: పుట్టి పెరిగిన ఊరిలోనే ఇద్దరు అన్నదమ్ములు వైద్యులుగా కొలువుదీరారు. సిరిసిల్ల పట్టణం విమల్ థియేటర్ ప్రాంతానికి చెందిన గోల్డ్‌స్మిత్ పొలాస సురేష్‌కు ఇద్దరు కుమారులు ఆదిత్య, ఆకాశ్. జిల్లా ఆస్పత్రిలో ప్రభుత్వ వైద్యులుగా మంగళవారం విధుల్లో చేరారు. ఇటీవల ప్రభుత్వం వైద్యుల నియామకాల కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. ఎండీ రేడియాలజీ చదివిన ఆదిత్య, ఎండీ జనరల్ మెడిసిన్ చదివిన ఆకాశ్ ప్రభుత్వ వైద్యులుగా ఉద్యోగం సాధించారు. ఇద్దరికీ జిల్లా జనరల్ ఆస్పత్రిలో పోస్టింగ్ రావడంతో తమ పుట్టిన ఊరిలో వైద్యసేవలు అందించే అవకాశం రావడం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పకడ్బందీ విచారణతోనే నేరస్తులకు శిక్ష

- ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి



వేములవాడ: పకడ్బందీ విచారణతోనే నేరస్తులకు శిక్ష పడే అవకాశం ఉంటుందని ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి పేర్కొన్నారు. పెండింగ్ కేసులు, ప్రస్తుత కేసుల పురోగతి, సబ్‌డివిజన్ పరిధిలో నేరాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం దిశ నిర్దేశం చేశారు. పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. తరచూ నేరాలకు పాల్పడే వరిపై రౌడీషీట్స్ తెరవాలన్నారు. గంజాయి రవాణా, వినియోగాన్ని అడ్డుకోవాలన్నారు. సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు ఊతం

గంభీరావుపేటలోని ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల



- గంభీరావుపేట డిగ్రీ కళాశాల అభివృద్ధికి రూ.5కోట్లు
- తీరనున్న గదుల కొరత
- పెరుగనున్న బోధన సిబ్బంది
- దరిచేరనున్న వసతులు

గంభీరావుపేట(సిరిసిల్ల): పేద విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యనందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. మెరుగైన వసతుల కల్పన.. బోధన సిబ్బంది కొరత లేకుండా చూస్తుంది. ఇందులో భాగంగా గంభీరావుపేట కేజీ టు పీజీ విద్యాలయంలో వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం ×పీఎం ఉష పథకం₹(ప్రధాన మంత్రి ఉచ్చతర్ శిక్ష అభియాన్) కింద గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలకు రూ.5కోట్లు మంజూరు చేసింది. కళాశాలలో ఏటా విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో గదుల కొరత ప్రధాన సమస్యగా మారింది. ప్రస్తుతం మంజూరైన నిధులతో నూతన తరగతి గదుల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. దీంతో గదుల కొరత తీరనుంది. తరగతి గదులు, ల్యాబ్‌లు తదితర విభాగాల్లో అభివృద్ధి పనులు జరిగి బోధన సౌకర్యాలు మెరుగుపడే మార్గం సుగమమైంది.

పెరుగుతున్న విద్యార్థులు

గంభీరావుపేట డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో వివిధ విభాగాల్లో సుమారు 900 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఓపెన్ యూనివర్సిటీ విభాగంలో మరో 600 మంది చదువుతున్నారు. ఈక్రమంలో పాత భవనంలో తరగతి గదులు, బోధన సామగ్రి సరిపోవడం లేదు. ల్యాబ్‌లలో సైతం బోధన తరగతులు నిర్వహిస్తున్నారు. కళాశాల శ్రేణి పెంపునకు ప్రభుత్వం ప్రోత్సాహం కల్పించడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కళాశాల అభివృద్ధికి బలమైన బూస్ట్ లభించినట్లయిందని అభిప్రాయపడుతున్నారు.

గదుల నిర్మాణానికి రూ.4.30 కోట్లు

ప్రస్తుతం ఉన్న భవన సముదాయంపై జీప్లస్ వన్‌గా కొత్తగా మరో భవన సముదాయం నిర్మించనున్నారు. పీజీ కళాశాల విద్యార్థుల బోధన కోసం నాలుగు తరగతి గదులు, కాన్ఫరెన్స్‌ల నిర్వహణకు సెమినార్ హాల్ నిర్మించడానికి రూ.4.30 కోట్లు వెచ్చించనున్నారు. పనులు సైతం ప్రారంభమయ్యాయి.

బోధన సామగ్రికి రూ.70లక్షలు

డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో బోధన సామగ్రి సమకూర్చడానికి రూ.70లక్షలు మంజూరయ్యాయి. వీటితో కంప్యూటర్లు, ప్రొజెక్టర్లు, ల్యాబ్ సామగ్రి కొనుగోలు చేయనున్నారు. కళాశాలలో సాంకేతికత, ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్, ఈ–లెర్నింగ్ వంటి సాధనాలను ఏర్పాటు చేయనున్నారు.

కొత్త కోర్సులు ప్రారంభిస్తాం



కొత్తగా వృత్తి నైపుణ్య కోర్సులు, పీజీ కోర్సులు ప్రారంభిస్తాం. నిధుల మంజూరుతో ఇవి ప్రారంభించడానికి అవకాశం ఏర్పడింది. అదే విధంగా తరగతి గదుల సమస్య తీరనుంది. కాన్ఫరెన్స్‌లు నిర్వహించడానికి ప్రస్తుతం చాలా కష్టంగా ఉంది. సెమినార్ హాల్ పూర్తయితే సమస్య తీరుతుంది.

– ప్రొఫెసర్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల

క్లుప్తంగా

కొత్తబస్టాండ్‌లో గుర్తుతెలియని మృతదేహం


గుర్తుతెలియని మృతదేహం

జగిత్యాలక్రైం: జగిత్యాల కొత్త బస్టాండ్‌లో గుర్తుతెలియని మృతదేహం కనిపించినట్లు పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు. వేములవాడ బస్ ప్లాట్‌ఫాం సమీపంలోని మరుగుదొడ్ల పక్కన వ్యక్తి మృతదేహం ఉందని, బూడిద రంగు టీషర్ట్, తెల్లపంచ కట్టుకుని ఉన్నాడని, మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చామని పేర్కొన్నారు. అతని సమాచారం తెలిసినవారు 87126 56815నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య


శ్రావ్య(ఫైల్)

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామంలో వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. శంకరపట్నం ఎస్సై శేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రావ్య (27)కు రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లికి చెందిన అమ్మిగల్ల ధర్మతేజ్‌తో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నాలుగేళ్ల కొడుకు శ్రేయాన్స్‌నందన్ ఉన్నాడు. ధర్మతేజ్ రెండేళ్ల క్రితం దుబాయ్ వెళ్లాడు. అప్పటినుంచి శ్రావ్య పుట్టింట్లో ఉంటోంది. సోమవారం రాత్రి దుబాయ్ నుంచి ధర్మతేజ్ శ్రావ్యతో వీడియో కాల్‌లో మాట్లాడాడు. ఇద్దరిమధ్య గొడవ జరగడంతో మంగళవారం వేకువజామున ఇంట్లో శ్రావ్య ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. శ్రావ్య సోదరుడు గొట్టె శివకృష్ణ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

మానసికవేదనతో ఒకరు..

చిగురుమామిడి: చిగురుమామిడి మండలం ఇందుర్తికి చెందిన బల్ల బాలయ్య(50) మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. బాలయ్య కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గుండె సంబంధిత ఆపరేషన్ సైతం జరిగింది. కొద్దిరోజులుగా మానసిక వేదనకు గురవుతూ.. మంగళవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

'కాళేశ్వరం'పై బూటకపు నివేదిక

- కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు


మాట్లాడుతున్న రవీందర్‌రావు

గంభీరావుపేట(సిరిసిల్ల): కాళేశ్వరం ప్రాజెక్టు ఎత్తిపోతలను నిలిపివేసి ఆ ప్రాజెక్టుపై బూటకపు నివేదికలతో కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని కేడీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై హరీశ్‌రావు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను గంభీరావుపేట బీఆర్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం ఎల్‌ఈడీలో వీక్షించారు. అనంతరం మండలస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గత 20 నెలలుగా ప్రజలు సాగు, తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో పదేళ్లలో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. ప్రపంచంలోనే అద్భుత కట్టడంగా ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టుపై కుట్రలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్‌పై కక్ష సాధింపు చర్యలకు పాలపడుతుందన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, రాబోవు ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులకు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. పార్టీ మండలాధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, సెస్ డైరెక్టర్ నారాయణరావు, దయాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నెలలో నలుగురు కార్యదర్శులు

- ఇల్లంతకుంట గ్రామపంచాయతీలో వింత పరిస్థితి
- అంతుచిక్కని బదిలీల వ్యవహారం
- ఈ సమయంలో వెలుగులోకి ఫేక్ అటెండెన్స్
- స్థానికంగా చర్చనీయంగా ట్రాన్స్‌ఫర్లు



ఇల్లంతకుంట గ్రామపంచాయితీ భవనం

ఇల్లంతకుంట(మానకొండూర్): ఇల్లంతకుంట మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో నెల రోజుల్లో నలుగురు కార్యదర్శులు బదిలీ కావడం చర్చనీయాంశమైంది. విధుల్లో చేరుతున్న వారు పట్టుమని పది రోజులు కూడా ఇక్కడ పనిచేయడం లేదు. మళ్లీ బదిలీపై ఇతర గ్రామానికి వెళ్తున్నారు. ఇలా ఎందుకు జరుగుతోందని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు.

వరుస బదిలీలు..

ఈనెల 2వ తేదీన రహీంఖాన్‌పేట గ్రామపంచాయతీ కార్యదర్శి పులి సంధ్య ఇల్లంతకుంట గ్రామపంచాయతీకి బదిలీపై వచ్చారు. విధుల్లో చేరి మూడు రోజులు గడవకముందే మంగళవారం తంగళ్లపల్లి మండలం నేరెళ్లకు బదిలీ అయ్యారు. గత నెల 28న ఇల్లంతకుంట గ్రామపంచాయతీ కార్యదర్శి ఎస్.వరుణ్‌కుమార్ బోయినపల్లి మండలం కొదురుపాకకు బదిలీ అయ్యారు. అప్పటి నుంచి నలుగురు పంచాయతీ కార్యదర్శులు విధుల్లో చేరడం, అంతలోనే బదిలీపై వెళ్లడం జరిగిపోతోంది. వరుణ్‌కుమార్ స్థానంలో మండలంలోని వెంకట్రావుపల్లి నుంచి చంద్రశేఖర్‌ను కేటాయించారు. అతను కూడా పదిహేను రోజులు గడువక ముందే జూలై 23న సోమారంపేటకు బదిలీ చేశారు. ఇల్లంతకుంటకు సంధ్యకు పోస్టింగ్ ఇవ్వగా ఆరు రోజులకే మరోచోటుకు స్థాన చలనం చేశారు. సోమారంపేట గ్రామపంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌ను ఇల్లంతకుంట గ్రామపంచాయతీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు ఎంపీవో శ్రీనివాస్ తెలిపారు. ఇల్లంతకుంట జీపీ కార్యదర్శి ఎస్.వరుణ్ బదిలీ అయిన సమయంలో ఆయన స్థానంలో వచ్చిన వెంకట్రావుపల్లి కార్యదర్శి చంద్రశేఖర్‌ను తిరిగి రెండోసారి కార్యదర్శిగా నియమించడం గమనార్హం.

స్థానికంగా చర్చ

ఇల్లంతకుంట మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో నెల రోజుల్లోనే నలుగురు కార్యదర్శులు బదిలీ కావడం చర్చనీయాంశమైంది. అయితే ఈ సమయంలోనే రాష్ట్రంతోపాటు జిల్లాలోనూ పలువురు పంచాయతీ కార్యదర్శులు ఫేక్ అటెండెన్స్‌తో మోసం చేస్తున్నట్లు వెలుగుచూసింది. దీంతో స్థానికంగా పంచాయతీ కార్యదర్శుల బదిలీలు చర్చకు దారితీసింది.

ఆటో బోల్తా ఘటనపై కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రం శివారులో మంగళవారం స్కూల్ విద్యార్థులను తరలిస్తున్న ఆటో బోల్తా పడిన సంఘటనపై విద్యార్థి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాహుల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రాచర్లబొప్పాపూర్‌కు చెందిన మహమ్మద్ షబానా బేగం-రఫీక్ దంపతుల కుమారుడు మహమ్మద్ హర్షద్ రిజ్వాన్ మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్నాడు. నిత్యం రాచర్లబొప్పాపూర్‌కు చెందిన షేక్ మలాన్ ఆటోలో స్కూల్‌కు వెళ్లివస్తుంటాడు. అదే ఆటోలో మరో పాఠశాలకు చెందిన విద్యార్థులు వెళ్తుండడంతో వారిని ఆ స్కూల్‌లో దింపేందుకు ఎల్లారెడ్డిపేట శివారులోని గాయత్రి డిగ్రీ కాలేజీ ఎదుట ఆటోను అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతోనే ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో హర్షద్ రిజ్వాన్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

మెట్‌పల్లి: పట్టణంలోని దుబ్బవాడకు చెందిన చిన్నారి జెట్టి మాన్విక్‌పై మంగళవారం కుక్కలు దాడి చేశాయి. ఇంటి ముందు ఆడుకుంటున్న మాన్విక్‌పై కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. బాలుడికి పలుచోట్ల గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతడిని మొదట స్థానిక ప్రభుత్వాసుపత్రికి.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తీసుకెళ్లారు.

ఘనత సాధించిన తండ్రీకొడుకులు

- యూరప్‌లో ఎత్తయిన శిఖరం అధిరోహణ
- అభినందించిన పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీహర్ష


వివేకానందరెడ్డి, మహిపాల్‌రెడ్డిని అభినందిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: యూరప్ ఖండంలోనే అత్యంత ఎత్తయిన శిఖరం మౌంట్ ఎల్బ్రోస్ 5,642 మీ ఎత్తు (18,150 అడుగులు) పర్వతశిఖరాన్ని పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సెంటినరీకాలనీకి చెందిన వివేకానందరెడ్డి, ఆయన తండ్రి మహిపాల్‌రెడ్డి అధిరోహించారు. దీంతో కలెక్టరేట్‌లో మంగళవారం తండ్రీకొడుకులను కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందించారు.

తండ్రిబాటలో తనయుడు..

మాజీ సైనికోద్యోగి అయిన లెంకల మహిపాల్‌రెడ్డి ఇప్పటికే పలు దేశాల్లోని 12 పర్వతాలను అధిరోహించి ఇంటర్నేషనల్ మౌంటనీర్ గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించారు. తన బాటలోనే తనయుడు వివేకానందరెడ్డిని కూడా పర్వతారోహకుడిగా తీర్చిదిద్దాలనే ఆలోచనతో గతేడాది శిక్షణ ఇచ్చారు. హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని పతాల్సు పర్వతాన్ని వివేకానందరెడ్డి అధిరోహించారు. తండ్రి ఇచ్చిన శిక్షణతోనే యూరప్‌లో అత్యంత ఎత్తయిన పర్వతాన్ని ఈనెల 3న అధిరోహించారు.

సే నో టు డ్రగ్స్ బ్యానర్ ఆవిష్కరణ

యూరప్‌లోని పర్వతాన్ని అధిరోహించిన వివేకానందరెడ్డి.. అక్కడ సే నో టు డ్రగ్స్ అనే బ్యానర్ ఆవిష్కరించారు. గతనెల 28న రష్యాకు చేరుకుని అక్కడే ఐదురోజుల పాటు శిక్షణ పొందినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతికూల వాతావరణంలోనూ మాస్టర్ వివేకానందరెడ్డి ధైర్యసాహసాలతో పర్వతాన్ని అధిరోహించడం అభినందనీయమని కలెక్టర్ అభినందించారు. భవిష్యత్‌లో మరెన్నో పర్వతాలను అధిరోహించి రికార్డు సృష్టించి తెలంగాణ రాష్ట్రానికి, భారతావనికి కీర్తిప్రతిష్టలు తేవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

భూవివాదంతోనే వృద్ధుడి హత్య

- ఇద్దరు నిందితుల అరెస్టు
- మెట్‌పల్లి సీఐ అనిల్‌కుమార్

మల్లాపూర్: భూ వివాదంతోనే మండలంలోని వేంపల్లికి చెందిన వృద్ధుడు సకినపెల్లి కాశీం(60)ను హత్యచేసినట్లు పోలీసులు గుర్తించారు. హత్యలో నిందితులైన నానం హన్మాండ్లు, ఆయన కుమారుడు నానం రాకేశ్‌ను అరెస్టు చేశారు. సంఘటన వివరాలను మెట్‌పల్లి సీఐ అనిల్‌కుమార్ మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. హన్మాండ్లు 15ఏళ్ల క్రితం కొన్న భూమి పక్కనున్న బావిని పూడ్చేందుకు ప్రయత్నించారు. దీనికి కాశీం అడ్డుపడ్డాడు. అప్పటినుంచి వారి మధ్య గొడవలు జరుగుతున్నాయి. కాశీం బాత్‌రూం విషయంలోనూ గొడవ జరుగుతోంది. పంచాయితీ జరిగినా పరిష్కారం కాలేదు. దీంతో కాశీంను హత్య చేయాలని హన్మాండ్లు, రాకేశ్ నిర్ణయించుకున్నారు. కాశీం అతడి పెద్ద కుమారుడి ఇంట్లో భోజనం చేసి వెళ్తుండగా అప్పటికే సిద్ధం చేసుకున్న కర్రతో ఈనెల 2న రాత్రి 7.30 గంటల సమయంలో దాడి చేశారు. కాశీం మృతి చెందిన తర్వాత హన్మాండ్లు, రాకేశ్ బైక్‌పై పరారయ్యారు. కాశీం కుమారుడు లక్ష్మీనర్సయ్య ఫిర్యాదు మేరకు ఎస్సై రాజు ప్రత్యేక బృందంతో దర్యాప్తు చేపట్టారు. మంగళవారం గోధూర్ చౌరస్తాలో నిందితులు ఉన్నారన్న సమాచారంతో పోలీసులు వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి హత్యకు ఉపయోగించి కర్ర, బైక్, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కి తరలించినట్లు తెలిపారు.

మృతుడి కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలి

- క్వారీ యజమాని, ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలి
- మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్


మాట్లాడుతున్న రసమయి బాలకిషన్

మానకొండూర్: ఇసుక లారీ ఢీకొని చనిపోయిన మానకొండూర్ మండలం ముద్దికుంట గ్రామానికి చెందిన కెక్కర్ల సురేశ్ కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలని, ప్రమాదానికి కారణమైన ఊటూరు ఇసుకక్వారీ యజమానులు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణపై కేసు నమోదు చేయాలని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ డిమాండ్ చేశారు. మానకొండూర్‌లో మంగళవారం మాట్లాడుతూ.. కెక్కర్ల సురేశ్ కరీంనగర్‌లోని ఓ ట్రాక్టర్ షోరూంలో పనిచేస్తూ కుటుంబానికి పెద్దదిక్కుగా ఉండేవాడన్నాడు. పోచంపల్లి వద్ద ఇసుక లారీని ఢీకొని చనిపోయాడాని తెలిపారు. సురేశ్‌ను అంబులెన్స్‌లో కరీంనగర్ తీసుకెళ్తుంటే పోలీసులు అడ్డుకున్నారని ఆరోపించారు. రహదారి వెంట ఇసుక లారీలు నిలిపేందుకు ఎవరు అనుమతి ఇచ్చారని మండిపడ్డారు. మృతుడి కుటుంబాన్ని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కనీసం పరామర్శించలేదన్నారు. మాజీ జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, శాతరాజు యాదగిరి, పిట్టల మధు, నెల్లి శంకర్, గుర్రం కిరణ్ గౌడ్, గడ్డం సంపత్, నెల్లి మురళి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

గుండెపోటుతో ముగ్గురు మృతి

- మృతుల నేత్రాలు దానం
- ఆరుగురు అంధులకు చూపు


అమృత్‌లాల్ చౌడ(ఫైల్)


తాండూరి శ్రీనివాస్(ఫైల్)


వెల్పుల సాయిలు(ఫైల్)


తాండూరి శ్రీనివాస్ కుటుంబాన్ని ఓదార్చుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలో సోమవారం రాత్రి ముగ్గురు గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ పెద్దను కోల్పోయిన విషాదంలో కూడా ఆ మూడు కుటుంబాలు.. సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రచార కార్యదర్శి వాసు ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ సహకారంతో ముగ్గురి నేత్రాలను దానం చేశారు. ఆరుగురు అంధులకు కంటి వెలుగులు ప్రసాదించేలా సహకరించారు. ఈ ముగ్గురిలో సమీప బంధువు తాండూరి శ్రీనివాస్ పార్థివదేహాన్ని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంగళవారం సందర్శించి నివాళి అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ముగ్గురి చూపు.. ఆరుగురికి కంటి వెలుగులు..

జవహర్‌నగర్‌కు చెందిన తాండూరి శ్రీనివాస్(49) సింగరేణిలోని ఎస్ఎంఎస్ ప్లాంట్‌లో స్టేనోగా పనిచేస్తున్నాడు. ఛాతీలో నొప్పి ఉందంటూ కుప్పకూలిపోయాడు. వెంటనే గోదావరిఖని గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందాడని డాక్టర్లు నిర్ధారించారు. శ్రీనివాస్ నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మాజీ కార్పొరేటర్ ఎండీ ముస్తాఫా నివాళి అర్పించారు. అదేవిధంగా దుర్గానగర్‌కు చెందిన సీనియర్ వ్యాపారి అమృత్‌లాల్ చౌడ(78) హఠాత్తుగా గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన 55 ఏళ్లుగా హార్డ్‌వేర్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. మృతుడి నేత్రాలను కుమారుడు, కోడలు జయప్రకాశ్ చౌడ-కవిత, మనమలు కౌశల్, నివేద్ దానం చేశారు. మరోవైపు.. ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి వేల్పుల సాయిలు(70) సింగరేణి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేశారు. మృతుల కుటుంబాలను సదాశయ ఫౌండేషన్, రామగుండం లయన్స్, స్ఫూర్తి క్లబ్ ప్రతినిధులు అభినందించారు.

వినూత్నంగా.. ఉపాధి పక్కాగా..

- కుర్తాలు, లాల్చీల తయారీ
- మరో నలభై మందికి ఉపాధి
- స్వయంకృషితో రాణిస్తున్న మధు





సిరిసిల్లకల్చరల్: పోగొట్టుకున్న చోటే వెతుక్కోవాలి.. అని పెద్దలు చెప్పిన మాటలను నమ్మి ముందుకెళ్లి విజయం సాధించాడు భైరి మధు. తన తప్పేమి లేకున్నా చేస్తున్న వ్యాపారంలో నష్టం రాగా.. అదే రంగంలో వినూత్నంగా ఆలోచించి ఉపాధి పక్కాగా చేసుకున్నాడు. మరో 40 మందికి ఉపాధి కల్పిస్తున్నాడు. చందుర్తి మండలం మర్రిగడ్డకు చెందిన మధు తల్లిదండ్రులు బతుకుదెరువు కోసం భీవండిలో స్థిరపడ్డారు. తప్పనిసరి పరిస్థితుల్లో తిరిగి సిరిసిల్ల సమీపంలోని చంద్రంపేటకు వచ్చాడు. తన రెక్కల కష్టంతో రెండు కార్ఖానాలు నిర్వహించే స్థాయికి ఎదిగాడు. అయితే కరోనా మహమ్మారి కారణంగా నష్టపోయాడు. పడిన చోటే తిరిగి లేవాలని భావించి.. చేనేత రంగంలోని వినూత్నంగా ఆలోచించాడు. ఇప్పుడు 40 మందికి ఉపాధి కల్పిస్తున్నాడు.

కరోనాతో కొత్త జీవితం

కరోనా నియంత్రణకు మాస్కులు ధరించడం తప్పనిసరైన నేపథ్యంలో మాస్కుల తయారీపై దృష్టి సారించిన మధు కరీంనగర్, వరంగల్ జిల్లాల వరకు సరఫరా చేశాడు. సంక్షోభం ముగిసి సమాజం సాధారణ స్థితికి చేరేసరికి మధుకు ప్రత్యామ్నాయ వ్యాపారం జాడ దొరికింది. జాతీయ జెండాల రూపకల్పన, బ్యానర్లతోపాటు పండుగల సందర్భంగా ప్రస్తుతం ఉపయోగిస్తున్న కండువాలు తయారు చేయడం ప్రారంభించాడు. గత ఐదేళ్లుగా వస్త్రం కొనుగోలు చేయడం, రంగులు అద్దించడంతోపాటు వాటిని ఆర్డర్ల మేరకు కండువాలు, తయారు చేయిస్తున్నాడు. కృష్ణాష్టమి, వినాయక చవితి వంటి సామూహిక ఉత్సవాల్లో ఉపయోగించే లాల్చీలు, కుర్తాలు కుట్టించి విక్రయిస్తున్నాడు. వివాహాది శుభకార్యాల సందర్భంగా ఆయా కార్యక్రమాల నిర్వాహకులు ఏకరీతిగా ఉండే కుర్తాలు ధరిస్తుంటారు. అదే అదనుగా హల్దీ, సంగీత్ వంటి ఉత్సవాలకు అవసరమైన కుర్తాలు తయారు చేయించి అమ్ముతున్నాడు.

మరో 40 మందికి ఉపాధి

మధు తాను ఉపాధి పొందడంతోపాటు మరో 40 మందికి కుర్తాలు కుట్టే పనిలో ఉపాధి ఇస్తున్నాడు. ఒక్కొక్కరు వారి పని తీరు ఆధారంగా రోజుకు కనీసం రూ.300 సంపాదిస్తున్నారు. మధు చేస్తున్న పనికి ఆయన సతీమణి శ్యామల సైతం తోడుగా నిలుస్తోంది.

కరోనా నేర్పిన దారి



కోవిడ్ మహమ్మారి కారణంగా చేస్తున్న వ్యాపారం నష్టపోయాను. మాస్కులు ధరించడం తప్పనిసరి అనే ప్రచారంతో మాస్కులు తయారు చేయించి ఊరూరా తిరిగి అమ్మేవాన్ని. టీవీఎస్ ఎక్సెల్ బండిమీద పలు జిల్లాల్లో మాస్కులు విక్రయించాను. మెల్లగా కరోనా పీరియడ్ తరువాత ఈ కుర్తాలు, జెండాలు, కండువాలు తయారు చేయించి విక్రయిస్తున్నాను. – భైరి మధు, తయారీదారుడు

కొన్నేళ్లుగా ఇక్కడే పనిచేస్తున్నా



కొంతకాలంగా కుర్తాలు, లాల్చీలు కుట్టడం కోసం ఇక్కడే పనిచేస్తున్నాను. రోజుకు 30 నుంచి 40 వరకు లాల్చీలు కుట్టగలుగుతున్నాను. రోజుకో రూ.400 చొప్పున నెలకు రూ.12వేలు వరకు ఆదాయం వస్తోంది. – సిరిపురం లక్షణ

ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో ప్రథమ బహుమతి


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ బబితా విశ్వనాథన్

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్‌లోని బిర్లా ఓపెన్‌మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన 3వ తరగతి విద్యార్థి మరియం భాను ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో ఎయిర్ రైఫిల్ షూటింగ్‌లో ప్రథమ బహుమతి సాధించినట్లు పీడీ సుంకరి మురళీధర్ తెలిపారు. ఈ నెల 3న స్వదేశ్ షూటింగ్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో ప్రతిభను ప్రదర్శించి ప్రథమ బహుమతి, రూ.10వేల నగదు గెలుచుకున్నట్లు వివరించారు. మంగళవారం విద్యార్థిని పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బబితా విశ్వనాథన్ అభినందించారు.

దైవదర్శనానికి వెళ్లి తిరిగొస్తూ..

- ఐలాపూర్ శివారులో రోడ్డు ప్రమాదం
- చెట్టును ఢీకొట్టిన కారు
- ఒకరు మృతి, ఆరుగురికి గాయాలు


గాడిపెల్లి నరేశ్ (ఫైల్)


చెట్టును ఢీకొట్టిన కారు

కోరుట్లరూరల్: దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా కారు అదుపు తప్పి చెట్టుకు ఢీకొన్న ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఆరుగురు గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని అయిలాపూర్ శివారులో మంగళవారం ఉదయం నాలుగు గంటలకు చోటుచేసుకుంది. స్థానికులు, ఎస్సై చిరంజీవి కథనం ప్రకారం.. అయిలాపూర్‌కు చెందిన గాడిపెల్లి నరేశ్ (36) కొంతకాలంగా గల్ఫ్ వెళ్లి వస్తున్నాడు. 20రోజుల క్రితమే స్వగ్రామానికి వచ్చాడు. ఇంట్లో పండగలన్నీ చేసుకున్నారు. ఈనెల 10న తిరిగి గల్ఫ్ వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు. సోమవారం ఉదయం తోడళ్లుడు బొల్లపెల్లి శ్రీనివాస్ కారులో రెండు కుటుంబాలు కలిసి యాదగిరి, స్వర్ణగిరి ఆలయాలను దర్శించుకున్నారు. రాత్రిసమయంలో తిరుగు పయనమయ్యారు. రెండు నిమిషాలైతే ఇంటికి చేరేదే.. ఆలోపే అయిలాపూర్ శివారు సబ్‌స్టేషన్ సమీపంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. బొల్లెపల్లి శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డాడు. శ్రీనివాస్ భార్య సుజాతకు రెండు కాళ్లు, ఓ చేయి విరిగింది. నరేశ్ భార్య సరితకు రెండు చేతులు విరిగాయి. నరేశ్ కుమారుడు, కూతురు, శ్రీనివాస్ కూతురును జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. నరేశ్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చిరంజీవి తెలిపారు.

అంజన్న సన్నిధిలో శ్రావణ సందడి


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


సామూహిక అభిషేకాలు చేస్తున్న భక్తులు


వీల్‌చైర్‌లో అంజన్న దర్శనం కోసం వస్తున్న భక్తురాలు


ఆలయ పరిసరాల్లో భక్తుల సందడి

మల్యాల: మల్యాల మండలం ముత్యంపేటలోని కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణ సందడి నెలకొంది. మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు రద్దీ కొనసాగింది. సామూహిక అభిషేకాలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. టికెట్లు, లడ్డూ విక్రయాల ద్వారా రూ.4.56లక్షల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. ఆలయ ఈఓ శ్రీకాంత్‌రావు, సునీల్‌కుమార్, చంద్రశేఖర్, హరిహరనాథ్, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.